telangana chowrastha.com
epaper.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా
Voice Of Democracy

సంపుటి: 01 సంచిక:299

24 క్యారెట్లు 1,59,930.00 | కిలో వెండి 2,90,000.00 | CHOWRASTHA DIGITALS | 22.05.2026 శుక్రవారం, హైదరాబాద్



## నిప్పులు కురిపిస్తున్న భానుడు

- వేడిమికి తాళలేక అల్లాడుతున్నా ప్రజలు
- పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాలలో 46.5 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- 20 జిల్లాల్లో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2



# జెన్ జీ రెవల్యూషన్

COCKROACH JANTA PARTY



నిరుద్యోగం,లీకేజీలపై యువత అసంతృప్తి
సోషల్ మీడియా వేదికగా పొలిటికల్
సెటైరికల్ మూవ్‌మెంట్
సోషల్ మీడియా సెన్సేషన్ 'కాక్రోచ్ జనతా పార్టీ'
4 రోజుల్లో బీజేపీని దాటిన ఫాలోవర్స్
ప్రతిపక్ష నేతలు, సెలెబ్రెటీలు సీజేపీలో చేరిక
కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేత
మరో కొత్త ఖాతాను క్రియేట్ చేసిన సీజేపీ అభిజీత్
ఒక కేసు విషయంలో యువతను పనిపాటలేని సోమరులు
జర్నలిస్టులు,ఆర్ టి ఐ కార్యకర్తలుగా
మారి అందరిపై దాడులు అంటూ బొద్దికలతో పోల్చిన సీజేఐ
సీజేఐ వ్యాఖ్యలకు నిరసన సీజేపీ ఆవిర్భావం
ఐదు సూత్రాలతో కూడిన మేనిఫెస్టో విడుదల

2

కాక్రోచ్ జనతా పార్టీ కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. వ్యంగ్యం, హాస్యం ప్రాతిపదికన ప్రారంభమైన ఈ ఉద్యమం సునామీ సృష్టించింది. ఏకంగా దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల సామాజిక మాధ్యమ ఖాతాలను సైతం ఇది దాటేస్తోంది.
ఇన్‌స్టాగ్రామ్‌లో బీజేపీ అధికారిక ఖాతాకు ఉన్న ఫాలోవర్లను 4 రోజుల్లోనే దాటి అందరినీ షాక్‌కు గురిచేసింది.

*తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో*

# బండి భగీరథ్‌ను మేమే అరెస్టు చేశాం

- బండి సంజయ్ సరెండర్ చేయించలేదు
- సరెండర్ చేస్తే ఇంటికి పిలిచి అప్పగించాలి కదా
- రోడ్డు మధ్యలో అరెస్ట్ చేస్తే.. సరెండర్ ఎలా అవుతుంది
- మైనర్ బాలిక అంశంలో బిఆర్ఎస్ రాజకీయాలెందుకు..?
- ప్రభుత్వం చట్టం, ప్రొసీజర్స్ ప్రకారం వ్యవహరిస్తుంది
- కేటీఆర్ కోర్టుగా, ప్రవీణ్ కుమార్ దర్యాప్తు అధికారిగా వ్యవహరిస్తున్నారు
- రాష్ట్రంలో 80 శాతం ధాన్యం కొనుగోలు పూర్తి
- మిగిలిన 20 శాతం కూడా త్వరలోనే పూర్తి చేస్తాం
- రైతుల విషయంలో బీఆర్ఎస్ శవ రాజకీయాలు
- ఓదార్చి అండగా ఉండాల్సిన వేళ సెల్ఫీలు దిగుతున్నారు
- బీజేపీ ప్రతి అంశాన్ని రాజకీయ కోణంలో చూస్తోంది
- సీఎం రేవంత్ రెడ్డి

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**
బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్టు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.పార్టీ సమావేశం కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్, మైనర్ బాలికకు ఇంత అన్యాయం జరిగితే ఎందుకు బయటకు రాలేదని ప్రశ్నించారు. పోక్సో కేసులో సున్నితత్వాన్ని కూడా చూడకుండా బీఆర్ఎస్ నేతలు ఏదో సాధించినట్లు శాడిస్టుల్లా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలోనూ బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైతులకు కష్ట సమయంలో అండగా నిలవాల్సింది పోయి, శవ రాజకీయాలు చేయాలని చూస్తోందని సీఎం ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వం

..మిగతా 2 లో



## కార్మికులకు గుడ్ న్యూస్

- కనీస వేతనాలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- జూన్ నుంచి అమల్లోకి కొత్త విధానం
- నాలుగు విభాగాలుగా కార్మికులను విభజన
- అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ గా వర్గీకరణ
- అన్‌స్కిల్డ్ కార్మికుల 12, 750 నుంచి 16 వేలు
- సెమీ స్కిల్డ్ కార్మికుల 13, 592 నుంచి 17 వేలు
- హై స్కిల్డ్ కార్మికులకు 14, 607 నుంచి 20 వేలకు పెంపు

2




## పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర..?

- రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా
- రాష్ట్రంలో రోడ్డెక్కని రైతులేడు
- రాస్తారోకో జరుగని రహదారి లేదు
- వడ్ల కొనుగోలుకు కాంటా పెట్టని ప్రభుత్వం
- రైతన్న చేతిలోనే కౌంట్‌డౌన్ మొదలైంది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ ఈ మొద్దునిద్ర? రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా? కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల రాశులపైనే కుప్పకూలుతున్నా కనికరించరా? కడుపు మండి ధాన్యం తగులబెట్టుకున్న అన్నదాతల తండ్లాట తీర్చరా? పంటలనే నమ్ముకొని రైతులు సంబురపడాల్సిన కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేమిటి? చేతగాని, చేవచచ్చిన సర్కార్ వైఫల్యానికి పరాకాష్ట కాదా?' అని రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ తీరుపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

*-తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో*

2



## యూపీ, బీహార్‌లో అత్యధిక వరకట్న మరణాలు

- 2023లో దేశవ్యాప్తంగా 6159 కేసులు
- ఒక్క యూపీలోనే 2,122.. బీహార్‌లో 1143
- ఎన్‌సీఆర్‌బీ గణాంకాలు వెల్లడి
- చట్టాలున్నా మహిళలపై ఆగని హింస
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అత్యధిక కేసులు
- ప్రభుత్వాల ఉదాసీన వైఖరిపై మహిళా సంఘాల ఆందోళన

2



## భారత్‌కు ఎల్పీజీ కటకట

- రోజుకు 4 లక్షల బ్యారెళ్ల ఇంధన కొరత
- సగానికి పడిపోయిన దిగుమతులు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో రవాణా ఆలస్యం

2



## పారదర్శక ఓటరు జాబితానే సర్ లక్ష్యం

- రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హక్కు
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ ఫారాల పూర్తికి అవకాశం
- మార్గదర్శకాలు విడుదల చేసిన సీఈవో కార్యాలయం
- సందేహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1950
- 'సర్'ప్రక్రియ జూన్ 25న ప్రారంభమై అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా
- సెప్టెంబర్ 28లోపు దరఖాస్తుల పరిశీలన

2

# నిప్పులు కురిపిస్తున్న భానుడు

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లలో రోజువారీ ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. దీంతో ఎండ వేడిమికి తాళలేక ప్రజలు అల్లాడుతున్నారు. తెలంగాణలో అత్యధికంగా పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5 డిగ్రీలు, సూర్యాపేట జిల్లాలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంచుపల్లిలో 46.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లుగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాల వారీగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు కింది పట్టికలో పరిశీలించవచ్చు.

| జిల్లా | నమోదైన ఉష్ణోగ్రత |
|---|---|
| పెద్దపల్లి | 46.5 |
| సూర్యాపేట | 46.5 |
| కొత్తగూడెం | 46.5 |
| హనుమకొండ | 46.4 |
| జగిత్యాల | 46.4 |
| భూపాలపల్లి | 46.4 |
| కరీంనగర్ | 46.4 |
| ఖమ్మం | 46.4 |
| ఆసిఫాబాద్ | 46.4 |
| ఆసిఫాబాద్ | 46.4 |
| మంచిర్యాల | 46.4 |
| ములుగు | 46.4 |
| నల్గొండ | 46.4 |
| సిరిసిల్ల | 46.4 |
| మహబూబాబాద్ | 46.3 |
| నిర్మల్ | 46.3 |
| నిజామాబాద్ | 46.3 |
| భువనగిరి | 46.3 |
| ఆదిలాబాద్ | 46.2 |

మరిన్ని జిల్లాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు : వరంగల్ జిల్లా 46.2 డిగ్రీలు, సిద్దిపేట 46.1, కామారెడ్డి 45.9, జనగామ 45.5, మెదక్ 45.1, నాగర్కర్నూలు 44.9, రంగారెడ్డి 44.9, సంగారెడ్డి 44.1, మేడ్చల్ 43.9, మహబూబ్నగర్ 43.6, హైదరాబాద్ 43.4, గద్వాల 43.3, వికారాబాద్ 43.1, వనపర్తి 42.8, నారాయణపేట 42.4 రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సూచించారు. ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందువల్ల అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో వడగాలుల నేపథ్యంలో ఆయన అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.విద్యుత్ సరఫరా, తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచన చేశారు. వడదెబ్బతో హాస్పిటల్స్ లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలన్నారు. పట్టణాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయవద్దని ప్రజలకు రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# జెన్ జీ రెవల్యూషన్

**తెలంగాణ చౌరస్తా నేషనల్ బ్యూరో:**

కాక్రోచ్ జనతా పార్టీ కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో సంచలనంగా మారింది. వ్యంగ్యం, హాస్యం ప్రాతిపదికన ప్రారంభమైన ఈ ఉద్యమం సునామీ సృష్టించింది. ఏకంగా దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల సామాజిక మాధ్యమ ఖాతాలను సైతం ఇది దాటేస్తోంది. ఇన్స్టాగ్రామ్లో బీజేపీ అధికారిక ఖాతాకు ఉన్న ఫాలోవర్లను 4 రోజుల్లోనే దాటి అందరినీ షాక్కు గురిచేసింది. అయితే యువత మద్దతుతో దూసుకుపోతున్న ఈ పార్టీకి, ఇప్పుడు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన అధికారిక ఎక్స్ ఖాతాను భారత్లో నిలిపివేశారు. కాగా, ఎక్స్ ఖాతాను నిలిపివేసిన కొన్ని గంటల్లోనే కాక్రోచ్ జనతా పార్టీ మరో కొత్త ఖాతాను క్రియేట్ చేసింది.

దేశంలో నెలకొన్న నిరుద్యోగం, ఎగ్జామ్ పేపర్ లీకేజీలు, రాజకీయ నేతల తీరుపై రగిలిపోతున్న యువత తమ నిరసనను సరికొత్తగా చాటుతోంది. ఇందులో భాగంగా సోషల్ మీడియా వేదికగా పుట్టుకొచ్చిందే 'కాక్రోచ్ జనతా పార్టీ'. కొద్దిరోజుల క్రితం కేవలం ఒక మీమ్ పేజీలా ప్రారంభమైన ఈ పొలిటికల్ సెటైరికల్ మూవ్మెంట్, ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో పెను సంచలనంగా మారింది. కాక్రోచ్ జనతా పార్టీ 4 రోజుల్లోనే ఇన్స్టాగ్రామ్లో 10 మిలియన్ల ఫాలోవర్ల మార్కును దాటేసి రికార్డు సృష్టించింది. 8.7 మిలియన్ ఫాలోవర్లతో ఉన్న బీజేపీ అధికార ఇన్స్టాగ్రామ్ ఖాతాను ఇది దాటేసింది. కాంగ్రెస్ పార్టీ 13.2 మిలియన్ ఫాలోవర్లతో ముందుంజలో ఉంది. కొన్ని రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ ఫాలోవర్లను దాటే అవకాశం కనిపించింది. యువత తమ అసంతృప్తిని వ్యక్తం చేయడానికి సరికొత్త మీమ్పాలిటిక్స్ను ఆయుధంగా మార్చుకుందని ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

**కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేత**

ఇలాంటి తరుణంలోనే ప్రముఖ సోషల్ మీడియా వేదిక ఎక్స్లో కాక్రోచ్ జనతా పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన అధికార ఎక్స్ ఖాతాను భారత్లో నిలిపివేశారు. ఎక్స్ ఖాతా నిలిపివేసే సమయానికి కాక్రోచ్ జనతా పార్టీకి దాదాపు రెండు లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఇది కేవలం ఒక తాత్కాలిక మీమ్ ట్రెండ్ మాత్రమే కాదని, దేశంలోని కోట్ల మంది యువత నిరాశకు, ఆవేదనకు అద్దం పడుతున్న డిజిటల్ విప్లవమని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు.

**పార్టీ ఆవిర్భవం వెనుక ఓ ఆసక్తకరమైన కథ**

ఇదిలా ఉండగా, కాక్రోచ్ జనతా పార్టీ ఆవిర్భవం వెనుక ఓ ఆసక్తకరమైన కథ ఉంది. ఇటీవల సుప్రీంకోర్టులో ఓ కేసు విచారణలో భాగంగా సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, ఉద్యోగాలు లేని కొంతమంది యువకులు జర్నలిస్టులుగా, RTI కార్యకర్తలుగా మారి అందరిపై దాడులు చేస్తున్నారనే అర్థంలో యువతను బొద్దింకలు, పరాన్నజీవులతో పోల్చారని వార్తలు వచ్చాయి. ఆ వ్యాఖ్యలకు నిరసనగానే ఈ కాక్రోచ్ జనతా పార్టీ పుట్టుకొచ్చింది. దీని వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే బోస్టన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా విభాగంలో పనిచేశారు. 2020 ఢిల్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ గెలవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాజ్యాంగానికి రక్షకుడిగా ఉండాల్సిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ఉన్నవారే యువతను కించపరచడం ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదని, అందుకే ఈ వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టానని అభిజీత్ దిప్కే తెలిపారు. తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించారని, సందర్భోచితంగా అర్థం చేసుకోలేదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చినప్పటికీ జరగాల్సిన నష్టం




జరిగిపోయింది. కాక్రోచ్ జనతా పార్టీ ప్రారంభించిన రెండు రోజుల్లోనే కొన్ని వేల మంది ఇందులో సభ్యులుగా చేరారు. ఇతర పార్టీ నేతలు సైతం సీజేపీకి మద్దతు తెలిపారు. తాము కూడా కాక్రోచ్ పార్టీలో చేరతామంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అలా ఇంటర్నెట్లో సరదాగా మొదలైన ఈ ఉద్యమం, యువత అసంతృప్తికి వేదికగా మారి అనధికారిక సంస్థగా రూపాంతరం చెందింది.

**ఐదు సూత్రాలతో కూడిన మేనిఫెస్టో విడుదల**

మరోవైపు ఈ పార్టీ తన వెబ్సైట్లో రాసుకున్న ట్యాగ్లైన్, డిమాండ్లు యువతను ఆలోచింపజేస్తున్నాయి .ఈ పార్టీలో చేరేందుకు కావాల్సిన అర్హతలు, మ్యానిఫెస్టో, విజన్ను తమ వెబ్సైట్లో పొందుపరిచారు. సోమరులు, నిరుద్యోగుల గొంతుక అనే ట్యాగ్లైన్తో కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటైంది. ఐదు సూత్రాలతో కూడిన ఓ మేనిఫెస్టోను కూడా విడుదల చేసింది. ఇంకా ఇందులో ఏమున్నాయంటే?

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు పదవీ విరమణ తర్వాత రాజ్యసభ పదవులు ఇవ్వడాన్ని నిషేధించాలి. ఎన్నికల్లో గెలిచి ఆ తర్వాత పార్టీలు మారే ఎమ్మెల్యేలు, ఎంపీలపై 20 ఏళ్ల పాటు నిషేధం విధించాలి. అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తే కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్పై UAPA చట్టం కింద చర్యలు తీసుకోవాలి.

పార్లమెంటు సభ్యుల సంఖ్యను పెంచకుండా మహిళలకు 50 రిజర్వేషన్ కల్పించాలి. కేంద్ర ప్రభుత్వ కేబినెట్లోనూ 50 శాతం మహిళలకు కేటాయించాలి. అంబానీ, అదానీ చేతుల్లో ఉన్న అన్ని మీడియా సంస్థల లైసెన్సులు రద్దు చేయాలి. గోడి మీడియా యాంకర్ల బ్యాంకు ఖాతాలను దర్యాప్తు చేయాలి.

**కాక్రోచ్ ఈజ్ బ్యాక్**

ఇదిలా ఉండగా కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాను నిలిపివేసిన వెంటనే ఆ డిజిటల్ అవుట్ఫిట్ మరో కొత్త ఖాతాను రూపొందించింది. "నిన్న మా ఎక్స్ ఖాతాను హ్యాక్ చేసేందుకు ప్రయత్నించారు. దాంతో ఇలాంటిది ఏదో ఉంటుందని ముందే ఊహించాం. ఇప్పుడు మేం 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్' అనే ఎక్స్ ఖాతాను ప్రారంభించాం. ప్రస్తుత పరిణామాలను న్యాయపరంగా పరిష్కరించుకుంటాం" అని సీజేపీ అభిజీత్ అన్నారు. ఈ ఖాతాను క్రియేట్ చేసిన గంటలోపే 16వేలమందికిపైగా ఫాలో అవుతున్నారు.

# పారదర్శక ఓటరు జాబితానే సర్ లక్ష్యం

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో అర్హులైన ప్రతి పౌరుడికీ ఓటు హకు కల్పించడమే ధ్యేయంగా, ఎలాంటి తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడమే లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్'(సర్) ప్రక్రియను చేపట్టినట్టు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి(సీఈవో) కార్యాలయం వెల్లడించింది. తరచూ వలసలు వెళ్లడం వల్ల ఒకే ఓటరు రెండు చోట్ల నమోదు కావడం, చనిపోయిన వారి పేర్లు జాబితాలోనే ఉండటం వంటి లోపాలను సరిదిద్దడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ముఖ్య ఉద్దేశమని తెలిపింది. 'సర్'పై ఓటర్లకు అవగాహన కల్పించేందుకు, అనుమానాలను నివృత్తి చేసేందుకు గురువారం సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. 'రాష్ట్రంలో'సర్'ప్రక్రియ జూన్ 25న ప్రారంభమై అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగియనున్నది. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్స్థాయి అధికారులు(బీఎల్వో) ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాల సేకరణ(ఎన్యుమరేషన్) చేపడుతారు. జూలై 31న డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటరు జాబితా ప్రచురిస్తారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్ల దాఖలుకు అవకాశం కల్పిస్తారు. సెప్టెంబర్ 28లోపు దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ పరిష్కారం ఉంటుంది. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు' అని సీఈవో కార్యాలయం వివరించింది.

గృహ సందర్శన ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ప్రతి ఇంటినీ కనీసం మూడుసార్లు సందర్శిస్తారు. మీ ఇంటికి వచ్చి ముందుగా ముద్రించిన 'ఎన్యుమరేషన్ ఫారాలు'(రెండు కాపీలు) అందించి, వాటిని ఎలా నింపాలో వివరిస్తారు. ఓటరు వివరాలు నింపిన తర్వాత, ఒక కాపీని బీఎల్వో తన వద్ద ఉంచుకుని, రెండో కాపీ రసీదుగా ఓటరుకు అందజేస్తారు. 18 ఏండ్లు నిండిన వారు లేదా 2026 అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు పూర్తి చేసుకోబోయే వారు కూడా కొత్తగా ఓటుహకు కోసం బీఎల్వో ద్వారా ఫారం6, డిక్లరేషన్ ఫారం పొంది దరఖాస్తు చేసుకోవచ్చు. ఒకవేళ మీరు ఆఫ్లైన్లో, అంటే నేరుగా ఫారం ఇవ్వకూడదనుకుంటే లేదా బీఎల్వో వచ్చే సమయానికి ఇంట్లో లేకపోయినా ఆన్లైన్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తిచేయవచ్చు. ఓటర్లు నేరుగా కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్ https://voters.eci.gov.in లేదా ECINET మొబైల్ యాప్ ద్వారా లాగిన్ అవ్వవచ్చు. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ లేదా ఎపిక్ నంబర్ ఎంటర్ చేసి, ఓటీపీ ద్వారా అథెంటికేషన్ పూర్తిచేయాలి.

ఎన్యుమరేషన్ ఫారం సమర్పించేందుకు ఆధార్ నంబర్ తప్పనిసరి కాదు. అది పూర్తిగా ఐచ్ఛికం. ఓటరుకు ఇష్టముంటేనే ఆధార్ వివరాలు నమోదు చేయవచ్చు. ఎన్యుమరేషన్ ఫారంలో ఫొటో తప్పుగా ఉన్నా లేదా పాతదైనా, ఆ ఫారంలో కేటాయించిన స్థలంలో మీ తాజా పాస్పోర్ట్ సైజ్ ఫొటో అతికించి బీఎల్వోకు అందించాలి. ఓటర్లు తమ ఫారాలను నింపి బీఎల్వోకు తిరిగి ఇవ్వాలి. ఒకవేళ ఫారం తిరిగి ఇవ్వని పక్షంలో సదరు ఓటరు చనిపోయాడా, ఇల్లు మారాడా లేక డూప్లికేట్ ఓటా అనేది పొరుగు వారి ద్వారా బీఎల్వో విచారణ జరిపి, ఆ పేరును డ్రాఫ్ట్ ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉంటుంది. కుటుంబసభ్యులు ఇతర నగరాలు, రాష్ట్రాలు, విదేశాల్లో ఉద్యోగం చేసే వారైతే ఎన్యుమరేషన్ ఫారాన్ని ఇంట్లోని ఇతర పెద్దలు పూర్తిచేయవచ్చు. వారి తరఫున కుటుంబసభ్యుడే సంతకం చేసి బీఎల్వోకు అందజేయవచ్చు. అయితే, ఎన్యుమరేషన్ దశలో ఓటరు ఎలాంటి డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. జూలై 31న డ్రాఫ్ట్ రోల్ విడుదలయ్యాక, ఓటరు అర్హతపై ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారికి ఏమైనా అనుమానాలుండి నోటీసు ఇస్తే, అప్పుడు మాత్రమే పాస్పోర్ట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్ లేదా ప్రభుత్వ గుర్తింపు కార్డు వంటి పత్రాలు చూపించాల్సి ఉంటుంది.

**సాయం కోసం హెల్ప్డెసులు**

'సర్' ప్రక్రియపై ఎలాంటి సందేహాలున్నా, దరఖాస్తులు నింపడంలో ఇబ్బందులు ఎదురైనా సహాయం చేయడానికి అన్ని జిల్లాల్లో ప్రత్యేక హెల్ప్డెసులు ఏర్పాటుచేశారు. ఇక్కడ శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండి ఓటర్లకు మార్గదర్శనం చేస్తారు. 'సర్'పై ఉన్న అనుమానాలను నివృత్తి చేస్తారు. ఓటర్లు తమ బీఎల్వోల నంబర్ల కోసం https://ceotelangana.nic.in వెబ్సైట్ను చూడవచ్చు. ఏదైనా సమాచారం లేదా సందేహాల కోసం టోల్ఫ్రీ నంబర్ 1950కి కాల్ చేసి సహాయం పొందవచ్చు.

# పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర..?

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

పంటల కొనుగోలుపై ఎన్నాళ్లీ ఈ మొద్దునిద్ర? రైతుల ప్రాణాలు పోతున్నా పంటలు కొనరా? కొనుగోలు కేంద్రాల్లోని వడ్ల రాశులపైనే కుప్పకూలుతున్నా కనికరించరా? కడుపు మండి ధాన్యం తగులబెట్టుకున్న అన్నదాతల తండ్లాట తీర్చరా? పంటలనే నమ్ముకొని రైతులు సంబురపడాల్సిన కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగమేమిటి? చేతగాని, చేవచచ్చిన సర్కార్ వైఫల్యానికి పరాకాష్ట కాదా?' అని రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ తీరుపై, ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నిర్లక్ష్య వైఖరిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

ఈ మేరకు సీఎం రేవంత్రెడ్డికి గురువారం కేటీఆర్ లేఖ రాశారు. పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకొనేందుకు రెండు నెలలుగా అన్నదాత పడుతున్న కష్టాలను ఆ లేఖలో ఏకరువు పెట్టారు. నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతులేడని, రాస్తారోకో జరుగని రహదారి లేదని పేర్కొన్నారు. నేడు ప్రభుత్వాన్ని బూతులు తిడుతున్న రైతులే రేపు కీలెరిగి వాతలు పెడుతారని హెచ్చరించారు. వడ్ల కొనుగోలుకు కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కార్కు రైతన్న చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని స్పష్టంచేశారు

తొమ్మిదిన్నరేండ్ల కేసీఆర్ పాలనలో కొండంత ధైర్యంతో బతికిన అన్నదాత.. కాంగ్రెస్ రెండున్నరేండ్ల పాలనలో ఆత్మవిశ్వాసం కోల్పోయి రోడ్డున పడ్డాడని సీఎంకు రాసిన లేఖలో కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆరు దశాబ్దాల కష్టాలు శాశ్వతంగా తీరిపోయాయని సంబురంగా సాగు చేసుకుంటున్న రైతన్నల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని దుయ్యబట్టారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలు చేసిన పథకాలకు రేవంత్ సర్కార్ పాతరేసి అన్నదాత వెన్ను విరిచిందని మండిపడ్డారు. కాంగ్రెస్ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయని తూర్పారబట్టారు.

పెట్టుబడి సాయా న్ని నాలుగుసార్లు ఎగ్గొట్టినా, యూరియా కష్టాల పాల్జేసినా వాటిని అధిగమించి పంటలు పండిస్తే కొనుగోలు చేసే నాథుడే లేడని ధ్వజమెత్తారు. 'మీరు చేసిన ద్రోహంతోపాటు వడదెబ్బ బారిన పడి 10 మందికి పైగా రైతులు ప్రాణాలు విడిచారు. 30 నెలల్లో సమైక్య పాలనలోని పరిస్థితులను తెచ్చి రైతులను నిండాముంచారు. ఇన్నాళ్లు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చారు. రైతుల కన్నీళ్లతో ఖాళీగా ఉన్న రిజర్వాయర్లు నిండేలా ఉన్నాయి' అని పేర్కొన్నారు. 'చివరికి మీ సొంత నియోజకవర్గమైన కొడంగల్ రైతులు సైతం రోడ్డెక్కి దుమ్మెత్తిపోసే దుస్థితి వచ్చిందంటే సంక్షోభంలో చిక్కుకున్న సాగు పరిస్థితికి అద్దంపడుతుంది' అని స్పష్టంచేశారు.

వరంగల్ నుంచి ఖమ్మందాకా కొనుగోలు కేంద్రాల్లో ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. 'కొనుగోలు చేసిన పంటలోనూ క్వింటాకు 10 కిలోలకు పైగా తరుగు పెడితే రైతుకు మిగిలేదేంటో చెప్పాలి.. గన్నీ బ్యాగుకు రూ.50 డిపాజిట్ చేయాల్సి రావడం సిగ్గుచేటని తె లిపారు. 'బోనస్ ఇచ్చే ముఖం మీ సర్కార్కు ఎలాగూ లేదు.. కనీసం వడ్లను సైతం కొనుడు చేతగాకుంటే ముక్కునేలకు రాసి 60లక్షల మంది రైతులకు క్షమాపణ చెప్పా లి' అని డిమాండ్ చేశారు. రైతులు గోసప డుతుంటే పర్యాటక వారోత్సవాలు జరుపుకోవడం బాధాకరమని మండిపడ్డారు. రేవంత్ చేసిన సాగుద్రోహానికి ఇప్పటివరకూ వెయ్యి మందికిపైగా రైతులు బలైపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రాల్లో చనిపోయిన రైతుల కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం అందజేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# కార్మికులకు గుడ్ న్యూస్

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో కార్మికులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. నాలుగు విభాగాలుగా కార్మికులను విభజించి కనీస వేతనాల నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా అమలు చేయనున్న కనీస వేతన సవరణ జూన్ నుంచి అమలులోకి వస్తుందన్నారు. కనీస వేతన పెంపుపై వేసిన కేబినెట్ సబ్ కమిటీ సిఫార్సు మేరకు నిర్ణయం తీసుకున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించారు. అన్స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అని విభజించారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి ఈ కేటగిరి జీతాలను అమలు చేయనున్నట్టు తెలిపారు.

మొదటి జోన్లో మున్సిపల్ కార్పొరేషన్లు, రెండో జోన్లో మున్సిపాలిటీలు,మూడో జోన్లో గ్రామీణ ప్రాంతాలు ఉంచారు. జోన్ 1లో ఉన్న మొదటి కేటగిరి అంటే అన్స్కిల్డ్ కార్మికుల కనీసస వేతనం 12, 750 నుంచి 16 వేలకు పెంచారు. మొదటి జోన్లోనే సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం 13, 592 నుంచి 17 వేలకు, స్కిల్డ్ కార్మికుల శాలరీని 13, 772 నుంచి 18, 500 రూపాయలకు, హై స్కిల్డ్ కార్మికులకు 14, 607 నుంచి 20 వేలకు పెంచారు.

**వైట్ కాలర్ జాబ్స్కే రిస్క్, బ్లూకాలర్ జాబ్స్కి కాదు**

వైట్ కాలర్ జాబ్స్కు ప్రమాదం ఉందేమో కానీ బ్లూ కాలర్ జాబ్స్కు ఎలాంటి ముప్పు లేదన్నారు రేవంత్ రెడ్డి. అందుకే ఇలాంటి నైపుణ్యాలు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. అవసరమైన ప్రోత్సహాకాలు అందిస్తున్నామని , విదేశాల్లో కూడా వారికి మంచి డిమాండ్ ఉందని చెప్పుకొచ్చారు. అలాంటి వారికి రెండు లక్షల వేతనంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి దేశాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని తెలిపారు. నైపుణ్యం ఉన్న వారు కావాలని చాలా దేశాలు సంప్రదిస్తున్నాయని అలాంటి ప్రయత్నాల్లోనే ప్రభుత్వం ఉందని వివరించారు.

# యూపీ, బీహార్లో అత్యధిక వరకట్న మరణాలు

**న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:**

దేశంలో బీజేపీ పాలనలో మహిళలకు భద్రత కరువవుతోంది. వరకట్నం పేరుతో వారిపై అనేక దారుణాలు పెరుగుతున్నాయి. దీంతో వారు భర్త, ఆయన కుటుంబీకుల నుంచి హింస, వేధింపులు, హత్యకు గురవడమే గాక బలవన్మరణాలకు పాల్పడటం వంటి ఘోరాలు జరుగుతున్నాయి. ఇలాంటి దారుణాలు ఆపడానికి అనేక చట్టాలున్నా.. మహిళలకు మాత్రం భద్రతను కల్పించలేకపోతున్నాయి. ప్రభుత్వాలు సైతం కఠిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయి. ముఖ్యంగా బీజేపీ పాలిత యూపీ, బీహార్ రాష్ట్రాల్లో అత్యధిక వరకట్న మరణాలు నమోదవడం అక్కడి ప్రభుత్వాల వైఫల్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న ఇతర రాష్ట్రాల్లోనూ ఇవే పరిస్థితులు నెలకొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

చదువు, ఉద్యోగం, సామాజిక, ఆర్థిక పరిస్థితులు వంటివి కూడా మహిళలకు రక్షణ కల్పించలేకపోతున్నాయి. వివాహం జరిగిన 17 నెలలకే దీపికా నగర్ (24) అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించడం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఒక టయోటో ఫార్చునర్ కారు, రూ.50 లక్షల నగదు కోసం భర్త కుటుంబం వేధించిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో పాటు ఇటీవల వెలుగుచూసిన మరికొన్ని వరకట్న మరణాలు (హత్యలు, ఆత్మహత్య కేసులు) భారత్లో మహిళల భద్రతపై తీవ్రమైన సందేహాలు రేకెత్తిస్తున్నాయి. యూపీలోని గ్రేటర్ నోయిడాకు చెందిన దీపికా నగర్కు పెండ్లై 17 నెలలే గడిచింది. ఆమె తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరి మరణించింది. పోస్టుమార్టం నివేదికలో ప్లీహం చిట్లిపోవడం, మెదడులో రక్తం గడ్డకట్టడం, అంతర్గత రక్తస్రావం, శరీరంపై గాయాల మచ్చలు ఉన్నట్టు వెల్లడైంది. ఆమెను టెర్రస్పై నుంచి తోసేశారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పోలీసులు ఆమె భర్తను, మామను అరెస్ట్ చేశారు. ఈ ఘటన ఒక్కటే కాదు. కొద్ది రోజుల క్రితం మధ్యపదేశ్లోని భోపాల్లో ట్విషా శర్మ అనే ఎంబీఏ పట్టభద్రురాలు, మాజీ మిస్ పూణే వివాహం జరిగిన ఐదు నెలలకే ఉరేసుకుని మృతి చెందిన ఘటన వెలుగుచూసింది. అయితే ఆమె కుటుంబం... వరకట్న వేధింపుల కారణంగానే తమ కూతురు తనువు చాలించిందని ఆరోపించింది. ఇక గతేడాది ఆగస్టులో నిక్కీ భాటి అనే మహిళను అదనంగా రూ.36 లక్షలు కావాలని డిమాండ్ చేస్తూ సజీవదహనం చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికే నగదు, బంగారం, ఒక కారు కట్నం కింద ఇచ్చినప్పటికీ వేధింపులు ఆగలేదని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఢిల్లీ పోలీస్ స్వాట్ కమాండో కాజల్ చౌదరి కూడా భర్త వేధింపుల కారణంగా మరణించిందని ఆమె కుటుంబం ఆరోపించింది. అయితే ఈ కేసులు చదువుకున్న, ఉద్యోగాల్లో ఉన్న మహిళలు కూడా వరకట్న హింస నుంచి తప్పించుకోలేకపోతున్నారనే వాస్తవాలను చూపిస్తున్నాయి.

**బీజేపీ ప్రభుత్వాలపై విమర్శలు**

యూపీలో యోగి ప్రభుత్వం 'లా అండ్ ఆర్డర్'పై పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. కానీ మహిళలపై వరకట్న హింస, గృహ హింస, హత్యలు ఇంత పెద్ద సంఖ్యలో కొనసాగుతుండటం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యాన్ని బయటపెడు తోందని విశ్లేషకులు చెప్తున్నారు. కఠిన చట్టాలు ఉన్నా అమలు బలహీనంగా ఉండడం, బాధిత మహిళలకు తక్షణ రక్షణ లేకపోవడం ప్రధాన సమస్యగా కనిపిస్తోందని అంటున్నారు.అలాగే బీహార్లో కూడా మహిళల భద్రత విషయంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శలు వస్తున్నాయి. వరకట్నం సామాజిక సమస్య అయినప్పటికీ, చట్ట అమలు, పోలీసు స్పందన, వేధింపులపై ముందస్తు చర్యల్లో ప్రభుత్వాల నిర్లక్ష్యం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనలు మహిళల భద్రతపై రాజకీయ నినాదాలకంటే బలమైన అమలు వ్యవస్థ, వేగవంతమైన న్యాయం, సామాజిక అవగాహన ఎంత అవసరమో మరోసారి గుర్తుచేస్తున్నాయని మేధావులు అంటున్నారు.

**బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అధికం**

జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్సీఆర్బీ) ప్రకారం 2014లో దేశంలో 8,455 వరకట్న మరణాలు నమోదయ్యాయి. 2023 నాటికి ఈ సంఖ్య 6,156కి తగ్గింది. అయితే పరిశోధకులు మాత్రం ఈ తగ్గుదల నిజమైన సామాజిక మార్పును సూచించదని చెప్తున్నారు. ఎందుకంటే కొన్ని వరకట్న మరణాల కేసులు 'మర్డర్' కేసులుగా నమోదవుతూ అధికారిక గణాంకాల్లో కనిపించకుండా పోతున్నాయని అజీమ్ ప్రేమ్జీ యూనివర్సిటీ పరిశోధకులు వివరించారు. 2023లో వరకట్న నిషేధ చట్టం కింద నమోదైన కేసులు 14 శాతం పెరిగి 15,489కు చేరాయి. అందులో ఒక్క యూపీలోనే 2,122 వరకట్న మరణాలు నమోదయ్యాయి. ఇక బీహార్లో 1,143 కేసులు నమోదయ్యాయి. ఇక ఆ తర్వాతి స్థానాల్లో కూడా బీజేపీ పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్ (468), హర్యానా (211)లు ఉండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది.

# భారత్కు ఎల్పీజీ కటకట

**న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:**

అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దేశీయంగా వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరాపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ జరిపిన దాడుల అనంతరం ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి గుండా రాకపోకలు నిలిచిపోవడంతో భారతదేశంలో రోజుకు దాదాపు 4 లక్షల బ్యారెళ్ల ఎల్పీజీ కొరత ఏర్పడింది. ప్రముఖ విశ్లేషణాత్మక సంస్థ కెప్లర్ గణాంకాల ప్రకారం.. ఫిబ్రవరి నెలలో రోజుకు సగటున 8.5 లక్షల బ్యారెళ్లుగా ఉన్న దిగుమతులు.. ఏప్రిల్ నాటికి సగానికి పైగా పడిపోయి కేవలం 3.7 లక్షల బ్యారెళ్లకు పరిమితమయ్యాయి. దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తి రోజుకు 75,000 బ్యారెళ్ల మేర పెంచినప్పటికీ.. దేశ అవసరాలకు అది ఏమాత్రం సరిపోవడం లేదు. భారత్ తన మొత్తం వంటగ్యాస్ అవసరాలలో మూడింట రెండు వంతులు దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందులో 80 శాతం సరఫరా యూఏఇ, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా దేశాల నుంచే వస్తుంది. అయితే.. యుద్ధం కారణంగా అక్కడి ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు జరగడంతో, ఆయా ప్రధాన దేశాల నుంచి భారత్కు వచ్చే దిగుమతులు ఏకంగా 75 శాతం మేర పడిపోయాయి. ఇవి తిరిగి సాధారణ స్థితికి రావడానికి చాలా సమయం పట్టేలా కనిపిస్తోంది. ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి భారతీయ ఇంధన సంస్థలు ఆస్ట్రేలియా, అర్జెంటీనా, అమెరికా వంటి ప్రత్యామ్నాయ దేశాల నుంచి ఎల్పీజీని కొనుగోలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే పశ్చిమాసియా దేశాల నుంచి భారత్కు రావడానికి కేవలం 5 నుంచి 6 రోజుల సమయం పడితే.. ఆస్ట్రేలియా నుంచి 20 రోజులు, అమెరికా లేదా అర్జెంటీనా నుంచి నౌకలు రావడానికి 35 నుంచి 45 రోజుల సుదీర్ఘ సమయం పడుతోంది. పైగా ఈ దేశాల నుంచి అందుతున్న ఇంధన పరిమాణం కూడా చాలా తక్కువగా ఉండటంతో మార్కెట్లో డిమాండ్కు తగ్గ సరఫరా సాధ్యం కావడం లేదు. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా పైప్డ్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లను వేగంగా పెంచుతున్నప్పటికీ.. అది కేవలం 1.6 కోట్ల ఇండ్లకు మాత్రమే పరిమితమైంది. కానీ దేశంలో ఎల్పీజీ సిలిండర్లపై ఆధారపడే ఇండ్లు 33 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ భారీ సరఫరా కొరత కారణంగానే ఈ నెల ప్రారంభంలో సిలిండర్పై ధరను ఏకంగా రూ.993 పెంచారు. ఫలితంగా బ్లాక్ మార్కెట్ దందా కూడా పెరిగింది. అధిక ధరలు ద్రవ్యోల్బణం ఎగిసిపడటానికి దారి తీస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# బండి భగీరథ్ను మేమే అరెస్టు చేశాం

▶▶ మొదటిపేజీ తరువాయి

యుద్ధాన్ని కూడా రాజకీయ కోణంలో చూస్తోందన్న రేవంత్ రెడ్డి, ఎన్నికలు కాగానే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచేస్తోందని ముఖ్యమంత్రి ఆరోపించారు.

రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయిందని, మిగిలిన 20 శాతం కూడా త్వరలోనే పూర్తి చేస్తామని సీఎం రేవంత్రెడ్డి అన్నారు. హమాలీల కొరత, అకాల వర్షాల వల్ల కొన్ని సమస్యలు వచ్చాయని తెలిపారు. రైతుల కష్టాలను తొలగించేందుకు మంత్రులు, అధికారులను పంపించి సాధ్యమైనన్ని ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తోందన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. రైతుల విషయంలో బీఆర్ఎస్ శవ రాజకీయాలు చేయాలని చూస్తోందని, ఓదార్చి అండగా ఉండాల్సిన వేళ సెల్ఫీలు దిగుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా అని సీఎం మండిపడ్డారు. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. కార్మికుల కనీస వేతనాల సవరణ సందర్భంగా సచివాలయంలో సీఎం నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేశారు.పోక్సో కేసులో బండి భగీరథ్ను పోలీసులే అరెస్టు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే ఆయన ఇంట్లో అప్పగించి ఉండేవారని, రోడ్డుపై పోలీసులు నాకా బందీ చేసేటప్పుడు ఎందుకు అప్పగిస్తారని సీఎం ప్రశ్నించారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు శాడిస్టులా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పోక్సో కేసులోని సున్నితత్వాన్ని చూడకుండా, అతిగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి కానీ దిగజారి ప్రవర్తించొద్దన్నారు.కేటీఆర్ బావమరిది ఫామ్ హౌస్ లో డ్రగ్స్ దొరికినప్పుడు నోటీసు ఇచ్చి విచారించామని, బండి భగీరథ్ విషయంలో కూడా నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చట్టం, ప్రొసీజర్స్ ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. కేటీఆర్ కోర్టుగా, ప్రవీణ్ కుమార్ దర్యాప్తు అధికారి అయినట్లుగా మాట్లాడుతున్నారన్నారు. కేసీఆర్ దిగిపోయి చాలా రోజులైనప్పటికీ, కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నట్లు అనుకుంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. పార్టీ మీటింగ్ కోసం జగిత్యాలకు వెళ్లిన కేసీఆర్, రాష్ట్రంలో ఓ మైనర్కు ఇంత పెద్ద సంఘటన జరిగితే ఎందుకు బయటకు రాలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వం ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని కూడా రాజకీయ కోణంలో చూస్తుందని సీఎం రేవంత్రెడ్డి ఆరోపించారు. అందుకే ఎన్నికలు కాగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం రాజకీయ కోణంలో కాకుండా ప్రతీ అంశాన్ని దీర్ఘకాలిక దృష్టితో చూస్తుందని, అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. కులగణన విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు. తెలంగాణ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించడం తమకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేసి అన్ని వివరాలు ప్రజల ముందుంచి, దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. మోదీ ప్రభుత్వం వెంటనే జనగణనలో కులగణన చేర్చి బలహీనవర్గాలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు.

# మరో రెండు మూడు నెలల్లో ట్రాన్స్‌ఫర్..

## మన చేతులు దులిపేసుకుందాం

- భద్రాద్రి ఎక్సైజ్ బాసుల అంతరంగం..
- బదిలీల ముసుగులో బరితెగించిన బెల్ట్ దందా!
- బోర్డులు మాత్రమే మీవా? అక్రమ మద్యం సామ్రాజ్యం ఎవరిది?..
- జిల్లా రథసారథికి సూటి ప్రశ్న
- తెరవెనుక 'పెద్దల' అండ.. 'కాసుల' కక్కుర్తిలో ఖాకీలు!
- ఏసీబీ పంజా విసిరితేనే కదిలే సీట్లు.. కరిగే లంచాల కోటలు!



**భద్రాద్రి కొత్తగూడెంబ్యూరో (తెలంగాణ చౌరస్తా):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అబ్కారీ (ఎక్సైజ్) శాఖ తీరు "ఉండీ లేనట్లు.. ఊడిపోనట్లు" తయారైంది. "మరో రెండు మూడు నెలల్లో ఎలాగూ ట్రాన్స్‌ఫర్లు అయి వెళ్ళిపోతాం.. ఈ లోపు వచ్చిన కాడికి నొల్లేసి చేతులు దులిపేసుకుందాం" అనే ధోరణిలో జిల్లా అబ్కారీ యంత్రాంగం వ్యవహరిస్తుండటం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. బదిలీల ముసుగులో అధికారులు అక్రమ మద్యం విక్రయాలకు, బెల్ట్ షాపుల దందాకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల బోర్డులు మాత్రమే ప్రభుత్వానివి.. లోపల జరిగే దందా అంతా మద్యం సిండికేట్లదే అన్నట్టుగా పరిస్థితి తయారైంది.

**'కాకి కాకి ముక్కు పొడవదు'.. ఏసీబీ ఉక్కుపాదం పడాల్సిందే!**
వ్యవస్థ మొత్తం అవినీతి ఊబిలో కూరుకుపోయినప్పుడు, 'ట్రాన్స్‌ఫర్'ల పేరుతో తప్పించుకోవాలని చూసే అధికారుల ఆటలు సాగనివ్వకూడదు. 'కాకి కాకి ముక్కు పొడవదు' అన్న చందంగా ఒకరినొకరు కాపాడుకునేందుకే అధికారులు ప్రయత్నిస్తారు. అందుకే ఈ లంచగొండి తిమింగలాల గుట్టు తేల్చాల్సింది కేవలం 'అవినీతి నిరోధక శాఖ' (ఏసీబీ) మాత్రమే!

**అధికారుల కళ్లు తెరిపించే ఏసీబీ యాక్షన్ ప్లాన్:**
ఆఫీసులపై ఆకస్మిక దాడులు: బదిలీల కంటే ముందే జిల్లాలోని అబ్కారీ స్టేషన్లపై, ఉన్నతాధికారుల కార్యాలయాలపై, వారి నివాసాలపై ఏసీబీ ప్రత్యేక బృందాలు తక్షణమే దాడులు జరపాలి.

**మామూళ్ల చిట్టా బహిర్గతం:**
మద్యం సిండికేట్ల నుంచి నెలవారీగా ఏ అధికారికి ఎంతెంత వాటాలు వెళ్తున్నాయో ఆ 'మామూళ్ల చిట్టాను' నడిబజార్లో పెట్టాలి.

**కఠిన చట్టాల కింద జైలుకు:**
బదిలీ అయి సేఫ్‌గా తప్పుకుందామనుకునే అధికారులపై తక్షణమే సస్పెన్షన్ వేటు వేసి, విచారణ జరిపి జైలుకు పంపాలి.
కుర్చీల్లో కూర్చుని ఏసీ రూముల్లో సంతకాలు పెట్టి, చేతులు దులిపేసుకుంటే సరిపోదు, క్షేత్రస్థాయిలో జరిగిన దోపిడీకి సమాధానం చెప్పాలి. మరి ఇప్పటికైనా ఏసీబీ దాడుల కంటే ముందే జిల్లా అబ్కారీ బాస్ కళ్లు తెరుస్తారా.. లేక బదిలీ అయ్యేలోపు అవినీతి బురదలోనే పూర్తిగా మునిగిపోతారా అన్నది చూడాలి!

### 'పెద్దల' అండ..
### 'ట్రాన్స్‌ఫర్' సాకుతో దండ!

ఈ అడ్డగోలు మద్యం సామ్రాజ్యం వెనుక జిల్లా అబ్కారీ బాస్ (సూపరింటెండెంట్) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక అసలు మర్మమేంటి? మరో కొన్ని నెలల్లో బదిలీ కాబోతున్నామనే సాకుతో, క్షేత్రస్థాయి అక్రమాలను పూర్తిగా గాలి కొదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. తెరవెనుక ఉన్న కొందరు రాజకీయ, ఆర్థిక 'పెద్దల' హస్తం ఈ దందాకు కొండంత అండగా నిలుస్తోంది. ఉన్నతాధికారుల కళ్ల ముందే నిర్ణీత ప్రభుత్వ ధరలకంటే (ఎం ఆర్ పి ) ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్నా, పల్లె పల్లెనా బెల్ట్ షాపులు వెలుస్తున్నా కనీసం ఒక్క కేసైనా నమోదు చేయకపోవడం వెనుక ఏ స్థాయి లంచాల నెట్‌వర్క్ నడుస్తోందో అర్థం చేసుకోవచ్చు. శాఖాగత నిఘా (విజిలెన్స్) విభాగం కూడా ఈ 'మామూళ్ల' మైకంలో జోగుతుండటం సిగ్గుచేటు.

# ఇంధన ధరల పెంపు ప్రజల నడ్డి విరిచే చర్య

- ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, తెలంగాణ చౌరస్తా:**
దేశంలో ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వం వరుసగా పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడం దారుణమని ఐఎన్‌టీయూసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు మండిపడ్డారు. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలను దాదాపు నాలుగు రూపాయల వరకు పెంచడం పూర్తిగా ప్రజా వ్యతిరేక నిర్ణయమని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇంధన ధరలు పెరగడం అంటే అది కేవలం వాహనదారులపైనే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తం మీద తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా ఖర్చులు అమాంతం పెరిగిపోవడం వల్ల నిత్యావసర సరుకుల ధరలు కూడా పెరిగి, పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనం మరింత భారంగా మారుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా రోజువారీ ఆదాయంపై ఆధారపడి బతికే ఆటో కార్మికులు, డ్రైవర్లు, శ్రామిక వర్గాలు ఈ నిర్ణయం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
మరోవైపు డీజిల్ ధరల పెంపుతో దేశ వెన్నెముక అయిన రైతాంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సూరిబాబు అన్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల ధరలు పెరిగి పెట్టుబడి భారం మోయలేక ఇబ్బందులు పడుతున్న రైతులకు, ఈ డీజిల్ ధరల పెంపు గొడ్డలిపెట్టులా మారిందన్నారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం, ఇలా రైతులపై అదనపు భారం మోపడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పూర్తిగా పక్కన పెట్టేసి, కేవలం కార్పొరేట్ సంస్థలకు అనుకూలమైన విధానాలతో ముందుకు సాగుతోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై విపరీతంగా పన్నులు వసూలు చేస్తూ సామాన్యుల జేబులు ఖాళీ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి, పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఊరటనివ్వాలని డిమాండ్ చేశారు. సామాన్యుల ఆవేదనను, ఆక్రందనలను కేంద్రం గుర్తించకపోతే, రాబోయే రోజుల్లో ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని కనకం సూరిబాబు హెచ్చరించారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయించుకోవాలి

- ఏఈఓ జానయ్య



**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ రైతు సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలంటే రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ (రైతు గుర్తింపు నమోదు) చేయించుకోవాలని నూతనకల్ క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) బుషిగంపల జానయ్య తెలిపారు.ఈ సందర్భంగా ఆయన నూతనకల్, చిల్పకుంట్ల, ఎర్రపహాడ్ గ్రామాల్లో రైతులను వారి ఇంటి వద్దే సంప్రదించి అగ్రి స్టాక్ యాప్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో చేపట్టారు. రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, క్రాప్ బుకింగ్, డిజిటల్ క్రాప్ సర్వే, వ్యవసాయ యాంత్రీకరణ, ధాన్యం కొనుగోలు, పీఎం కుసుం పథకం వంటి ప్రభుత్వ పథకాలతో పాటు విత్తనాలు, ఎరువులు ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అత్యంత కీలకమని ఆయన వివరించారు.అలాగే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే కొత్త పథకాల ప్రయోజనాలు పొందడానికి కూడా ఈ నమోదు ప్రక్రియ ప్రామాణికంగా ఉపయోగపడుతుందని తెలిపారు. నూతనకల్ క్లస్టర్ పరిధిలోని నూతనకల్, చిల్పకుంట్ల, ఎర్రపహాడ్ గ్రామాల్లో మొత్తం 2,625 మంది పట్టాదారు రైతులు ఉండగా, ఇప్పటివరకు 1,725 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని, ఇంకా 900 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉందని వెల్లడించారు.ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు ప్రస్తుతం అమలులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలకు అనర్హులుగా పరిగణించబడే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ఇంకా నమోదు చేయించుకోని రైతులు తమ పరిధిలోని రైతు వేదికను లేదా గ్రామాలకు వచ్చే కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ఎన్యూమరేటర్లను సంప్రదించి, మొబైల్ మరియు ఆధార్‌కు వచ్చే ఓటీపీ వివరాలను అందించి వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు.మే 31, 2026 వరకు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు గడువు ఉన్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ జానయ్య కోరారు.ఈ కార్యక్రమంలో రైతులు బండపల్లి కిషన్, భూరెడ్డి మధుకర్ రెడ్డి, గుండెబోయిన సతీష్, గాజబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.



# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

- దేశ సమగ్రత,శాంతి, ప్రజాస్వామ్యం కోసం ఆయన నిరంతరం కృషి
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**
మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు.రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం రాజీవ్ గాంధీ తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. దేశ అభివృద్ధి, సాంకేతిక రంగ పురోగతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు కట్ట మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, నకిరకంటి వెంకన్న, తోనకనూరి సైదులు గౌడ్, జటంగి గణేష్ యాదవ్, బండపల్లి సాగర్ గౌడ్, బంటు బద్రీ, బద్దం ప్రశాంత్ రెడ్డి, మద్దెల సురేందర్ గౌడ్, సురకంటి చంద్రారెడ్డి, మేడిపల్లి అశోక్, నెల్లుట్ల మహేష్, నకిరకంటి మధు, గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డుపల్లి అంజయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ బొల్క సైదులు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్వాయి కార్తీక్, మూడ్ మోహన్ నాయక్, బొల్లెద్దు నాగయ్య, ముల్కలపల్లి గణేష్, పాల్వాయి పరుశరాములు, బయ్య గణేష్ యాదవ్, దండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు.



# క్షతగాత్రుని చికిత్సకై ఆర్థిక సాయం

- ఝాన్సీ రెడ్డి ఆదేశం మేరకు సునీత రాజేందర్
- రూ.10 వేల సాయం

**తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:**
మెదడులో రక్తం గడ్డకట్టి పక్షవాతం బారిన పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడి చికిత్స కై ఆర్థిక సాయం అందించి స్థానిక కాంగ్రెస్ నాయకులు మాలోతు సునీత రాజేందర్ మానవత్వం చాటుకున్నారు.వివరాల్లోకి వెళితే...మండలంలోని పెద్ద మంగ్యా తండా పంచాయతీకి చెందిన జాటోతు నరేష్ కు మెదడులో రక్తం గడ్డ కట్టడంతో ఇటీవల పక్షవాతం వచ్చింది. నడవలేని స్థితిలో బెడ్ కే పరిమితమైన 20 ఏళ్ల యువకుడుకి ఖరీదైన వైద్యం చేయించాల్సి ఉంది. నడవలేని స్థితిలో ఉన్న ఆ యువకుడికి హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స యీఅందిస్తున్నారు.ఆర్థిక స్తోమత లేక పోవడంతో చికిత్స ఎలా చేయించాలో పాలుపోక తండ్రి రవి ఆర్థిక సహాయం చేసి నా కుమారుని ప్రాణాలు కాపాడాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి,టిపిసిసి ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిలను వేడుకున్నాడు.వారి ఆదేశాల మేరకు వెలికట్ట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మాలోత్ సునీతరాజేందర్ చికిత్స కోసం రూ.10 వేల రూపాయల నగదును బాధితుని తల్లిదండ్రులకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం అందరి బాధ్యత అని తెలిపారు. యశస్విని,ఝాన్సీ రెడ్డి ల స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఎంతో భవిష్యత్తు కలిగిన యువకులు అనుకోని అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితం బాధాకరమన్నారు.అలాంటి వారికి స్థానికులు చేయుత అందిస్తే తిరిగి ఆరోగ్యం పొందుతారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద మంగ్యా తండా సర్పంచ్ జాటోతు రాం లాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బానోత్ శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యం పేదలకు అందాలి

- ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ
- మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు
- సిబ్బందికి విధి నిర్వహణపై మున్సిపల్ అధికారుల ఆదేశాలు





**అశ్వారావుపేట,తెలంగాణ చౌరస్తా:**
అశ్వారావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వసతులపై అక్కడ చికిత్స పొందుతున్న రోగులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది అంతా సమయానికి విధులకు హాజరుకావాలని, దవాఖానాకు వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ మౌనిక, అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మిండా హరిబాబు, చిన్నంశెట్టి శ్రీను, నార్లపాటి మౌనిక, నార్లపాటి దివాకర్, నండ్రు రమేష్, కాసాని పద్మశేఖర్, తాడేపల్లి రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, యూత్ నాయకుడు జూపల్లి ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిఘటన పోరాటయోధుడు జెన్ను

- జిల్లా ప్రజలకు ఆయనొక ధైర్యం
- ఐ ఫ్ టీ యూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా:**
జెన్ను సార్ 5వ వర్ధంతి సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలో కామ్రేడ్ గునుగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రం లో జెన్ను సార్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట నాగయ్య మాట్లాడుతూ ప్రజల జీవితాలు మారాలంటే, ఈ దేశంలో సమసమాజం రావాలనీ, ఒక మనిషి మరొక మనిషిని, ఒక వర్గం మరొక వర్గాన్ని దోపిడీ చేసే ఈ దోపిడీ వ్యవస్థ పోయి, శ్రమకు తగ్గ ఫలితం వచ్చి అందరూ సమానమే అనే వ్యవస్థ రావాలని తన జీవితాంతం పోరాడిన మహా విప్లవ నేత జలగం జనార్దన్ అని అన్నారు. ప్రస్తుత సూర్యపేట జిల్లాలోని ఏపూరు గ్రామంలో పుట్టిన జెన్ను సార్ చిన్నతనంలోనే విప్లవం వైపు ఆకర్షితులై చనిపోయే వరకు తను నమ్మిన పంథాతోనే బ్రతికాడని,కార్యకర్తగా అజ్ఞాత జీవితంలోకి వెళ్లి నాయకుడిగా బయటికి వచ్చాడని, 14 సంవత్సరాలు విరామం కోరకుండా అజ్ఞాత జీవితం గడిపాడని, పార్టీని బలోపేతం చేయడం కోసం ఎంత గానో శ్రమించాడని, ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పార్టీకి పెద్ద దిక్కుగా ఉండి, ఎక్కడ ఏ కార్యకర్తకు సమస్య వచ్చినా తను ఆ చోటుకు వెళ్లేవాడని, జెన్ను సార్ ప్రజలకు ఒక ధైర్యం అని అన్నారు. దేశంలో రోజురోజుకూ బీజేపీ నాయకత్వంలో పెరిగిపోతున్న అంతరాలు, విద్వేషాలు కుల మత రాజకీయాలను ఎదిరించాలంటే బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని, మణిపూర్ మండిపోతుంటే కళ్ళు మూసుకొని అక్కడి అమయాక జనాలను చంపుతున్నా ఏ మీడియా దాన్ని చూపించదని, కాబట్టి ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత ఇవాళ కమ్యూనిస్టుల మీద, విప్లవ కారుల మీద ఉందని, కాబట్టి ప్రజలని చైతన్య పరిచి పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని, ఆ దిశగా మన చర్యలు ఉంటేనే జెన్ను సార్ విప్లవ ఆశయాన్ని సాధించగలమని అన్నారు.ఈ కార్యక్రమంలో దేసోజు మధు, దగ్గుల మల్లయ్య, బిక్కి రవి, జతంగి సతీష్, గడ్డం పాపయ్య, కుసు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





# ఉపాధి హామీ కార్మికుల సంఖ్యను పెంచాలి


- జిల్లా కలెక్టర్ అంకిత్
- హేమచంద్రపురంలో 'ఎంఐ ట్యాంక్' పనుల ఆకస్మిక తనిఖీ
- పనిస్థలాల్లో నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరి
- నిధులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలి.

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా:**
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కార్మికుల సంఖ్యను మరింత పెంచాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూపుదిద్దుకుంటున్న ఎంఐ ట్యాంక్ (చెరువు) పనులను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ నేరుగా కార్మికుల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు. వేతనాలు సకాలంలో అందుతున్నాయా? పనుల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.
ఎండ తీవ్రత దృష్ట్యా ప్రత్యేక జాగ్రత్తలు ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున పనిస్థలాల్లో కార్మికుల ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్మికులకు ఇబ్బంది కలగకుండా తాగునీటి సదుపాయం కల్పించాలి.ఎండ తగలకుండా నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలి.అత్యవసర వైద్యం కోసం ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.
"ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు కార్మికులకు పూర్తి స్థాయిలో అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలి."

**హాజరు శాతం పెంచాలి:**
గ్రామంలోని ఆక్టివ్ జాబ్ కార్డుల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకోగా... గ్రామంలో మొత్తం 300 జాబ్ కార్డులు ఉండగా, ప్రస్తుతం 146 మంది మాత్రమే పనులకు వస్తున్నారని అధికారులు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. ఉపాధి హామీపై గ్రామస్థులకు మరింత అవగాహన కల్పించి, హాజరయ్యే వారి సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం మాస్టర్ రోల్స్‌ను పరిశీలించి, హాజరు నమోదులో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు.
ఉపాధి హామీ నిధులతో చేపట్టే పనులు గ్రామాభివృద్ధికి, ముఖ్యంగా నీటి వనరుల పెంపకానికి ఉపయోగపడేలా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కంగాల అంజలి, డిఆర్డిఓ విద్యాచందన, తహసీల్దార్ శిరీష, పంచాయతీ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బోడుప్పల్లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి

- రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన
- మాజీ మేయర్ అజయ్ యాదవ్ ,సింగిరెడ్డి పద్మా రెడ్డి



**బోడుప్పల్ తెలంగాణ చౌరస్తా :**
మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి డిసీసీ అధ్యక్షులు, తోటకూర వజ్రేష్ యాదవ్ , డాక్టర్ రాపోలు రాములు, మాజీ మేయర్ తోటకుర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, సీనియర్ నాయకులు , యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని స్వర్గీయ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ భారతదేశానికి చేసిన సేవ కార్యక్రమాలు, ప్రజాసంక్షేమ పథకాలను స్మరించుకున్నారు.

# కొత్తగూడెం బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

* 119 నియోజకవర్గాలకు ఇంచార్జీలను ప్రకటించిన గులాబీ అధినేత కేసీఆర్
* డిజిటల్ ప్రక్రియలో ముమ్మరంగా సాగనున్న సభ్యత్వ నమోదు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో,తెలంగాణ చౌరస్తా:**



భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియకు గులాబీ బాస్, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు శ్రీకారం చుట్టారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసే లక్ష్యంతో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ప్రత్యేక ఇంచార్జీలను అధిష్టానం శనివారం రాత్రి ప్రకటించింది. ఇందులో భాగంగా కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా పార్టీ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గాయత్రి రవి నియమితులయ్యారు.

**కేసీఆర్ కీలక నిర్ణయం.. డిజిటల్ పద్ధతిలో నమోదు**

ఈ సారి సభ్యత్వ నమోదును పూర్తి పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతికతతో కూడిన డిజిటల్ ప్రక్రియ ద్వారా నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ, ప్రతి గ్రామం, ప్రతి వార్డులో డిజిటల్ సభ్యత్వాన్ని విజయవంతం చేసే బాధ్యతను నియోజకవర్గాల వారీగా సీనియర్ నేతలకు అప్పగించారు. కొత్తగూడెం లాంటి కీలక నియోజకవర్గానికి పార్టీలో నమ్మకమైన, చురుకైన సీనియర్ నేతగా పేరున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్రను నియమించడం గమనార్హం.

"పార్టీ అధినేత కేసీఆర్ నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. కొత్తగూడెం నియోజకవర్గంలో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదును రికార్డు స్థాయిలో విజయవంతం చేస్తాం. స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుపుకొని గులాబీ జెండాను మరింత బలోపేతం చేస్తాం."

**— వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్**

కొత్తగూడెంలో జోష్.. హర్షం వ్యక్తం చేస్తున్న శ్రేణులు వద్దిరాజు రవిచంద్ర నియామకంపై కొత్తగూడెం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ మున్సిపల్, మండల, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా జాతీయ స్థాయిలో రాణిస్తున్న రవిచంద్ర ఆధ్వర్యంలో ఇక్కడ సభ్యత్వ నమోదు ముమ్మరంగా సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఆయన నియోజకవర్గ నేతలతో ప్రత్యేక సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి, డిజిటల్ నమోదు యాక్షన్ ప్లాన్‌ను వివరించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.





# దళితుల పట్ల వివక్షత చూసినా వారిని అరెస్ట్ చేయాలి

* దళిత సంఘాల ఆగ్రహం

**కాల్వశ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**

దళితులను ఆలయంలోకి రాకుండా వివక్షత చూపిన వారిపై కేసు నమోదు చేసి మూడు రోజులు గడుస్తున్న ఇప్పటివరకు అరెస్టు చేయలేదని వెంటనే అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లి గ్రామంలో సోమవారం గౌడ కులస్తులు నిర్వహించిన ఎల్లమ్మ బోనాల సందర్భంగా దళితులను ఆలయంలోకి రానీయకుండా అడ్డుకోవడం తీవ్ర వివక్షతకు నిదర్శనమని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. గురువారం గ్రామానికి చేరుకున్న దళిత సంఘాల ప్రతినిధులు బాధిత కుటుంబాలను పరామర్శించి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ... రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను కాలరాస్తూ దళితుల పట్ల కుల వివక్ష ప్రదర్శించడం అత్యంత దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో జరిగిన ఘటనపై ఇప్పటికే కేసు నమోదు అయినప్పటికీ, ఇప్పటివరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు.వెంటనే కేసులో ఉన్న వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు.గ్రామంలో శాంతి భద్రతలు కాపాడుతూ బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఆది జాంబవ అరుంధతి రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి పాపయ్య, మహనీయుల ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరి కైలాసం,మాదిగ జాగృతి జిల్లా అధ్యక్షుడు ఏదుల శంకరయ్య ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాతంగి రేవంత్,సీనియర్ అంబేద్కర్ సంఘం జిల్లా నాయకులు న్యాతరి శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు వివిధ దళిత సంఘాల నాయకులు,మాదిగ సంఘ గ్రామ సభ్యులు పాల్గొన్నారు.సమావేశానంతరం పెద్దపల్లి డిసిపి భూక్యా రామ్ రెడ్డిని దళిత సంఘాల నాయకులు,బాధితులు కలిసి సంఘటన విషయంలో కేసు నమోదు అయిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరినట్లు తెలిపారు.







# ఉపాధి హామీ పనుల ఆకస్మిక తనిఖీ

* కూలీలతో ముచ్చటించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**నూతనకల్/ఆత్మకూరు (ఎస్) తెలంగాణ చౌరస్తా :**

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి, ఆదాయ భద్రతను కల్పిస్తుందని, గ్రామీణ ప్రాంత కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరై ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనులు ప్రభుత్వం నిర్దేశించిన సాంకేతిక, నాణ్యత ప్రమాణాల ప్రకారం జరుగుతున్నాయా లేదా అని స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గురువారం ఆయన ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్, మద్దిరాల మండలం, నూతనకల్, పోలుమల్ల గ్రామాల్లో సాగుతున్న ఉపాధి హామీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.తీవ్రమైన ఎండల నేపథ్యంలో పని స్థలాల్లో కూలీలకు కల్పిస్తున్న ప్రాథమిక సౌకర్యాలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఎండ నుండి ఉపశమనం కోసం ఏర్పాటు చేసిన షెడ్, తాగునీరు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచిన ఓఆర్ఎస్ ప్యాకెట్లను తనిఖీ చేశారు.ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయమే పనులు ముగించుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సాదాసీదాగా, స్నేహపూర్వకంగా కూలీల వద్దకు వెళ్లి వారితో ముచ్చటించారు.వేతనాలు సమయానికి జమవుతున్నాయా, ప్రభుత్వం ప్రకటించిన సగటు వేతనం అందుతుందా, పనుల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కూలీలు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించగా, ఆయన వాటిని విని, తక్షణ పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తమతో అంతలా కలిసిపోవడంతో కూలీలు హర్షం వ్యక్తం చేశారు.జిల్లాలో వడదెబ్బ తగిలిన వారికి తక్షణ వైద్యం అందించేందుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి, వైద్యుల సలహాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, అడిషనల్ పిడి చంద్రశేఖర్, ఆత్మకూర్ (ఎస్) ఎంపీడీవో హసిమ్, నూతనకల్ ఎంపీడీవో సునీత, మద్దిరాల ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, ఏపీడి పవన్ కుమార్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# అగ్నికి ఆహుతైన వరి పొలం

**కాల్వ శ్రీరాంపూర్,తెలంగాణ చౌరస్తా:**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేటకు గ్రామానికి చెందిన రైతు పుల్లూరి సాగర్ కు చెందిన ఎకరన్నర వరి పొలం గురువారం ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైంది.కొందరు గుర్తుతెలియని వ్యక్తులు పక్కనే ఉన్న చేలల్లో వ్యర్థాలను తగులబెట్టగా ఆ మంటలు గాలికి వరి పొలంలోకి వ్యాపించాయి.ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే లోపే పంట పూర్తిగా కాలి బూడిదైందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

# ఆదర్శ పాఠశాలలో వేసవి శిక్షణ దిగ్విజయం

**తెలంగాణ చౌరస్తా, కొడకండ్ల :**

జనగాం జిల్లా కొడకండ్ల మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఈ నెల 11 నుండి ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు శిభిరంలోని విద్యార్థులకు వివిధ రకాల ఆటలు ,పాటలు,సాంస్కృతిక కార్యక్రమాలు,యోగా నేర్పించారు.టీవీలో పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలు చూపిస్తూ వేసవిలో వారికి ఆనందాన్ని కల్గిస్తున్నందుకు పిల్లల తల్లిదండ్రులు పాఠశాల ప్రిన్సిపాల్ .భానుప్రసాద్ ను, పి.టీ జె.సుధాకర్ను, యోగా మాస్టర్ డీ.సోమయ్యను అభినందించారు.





# బోల్తాపడ్డ లారీ, బొలెరో

* డ్రైవర్ కు తీవ్ర గాయాలు
* సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదం
* బొలెరోను ఢీ కొని..
* అతివేగంతో కొంత దూరం వెళ్లి బోల్తాపడ్డ లారీ

**సుల్తానాబాద్,తెలంగాణ చౌరస్తా :**

సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల రాజీవ్ రహదారిపై గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ నుంచి మంచిర్యాలకు మామిడికాయల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనాన్ని పత్తి గింజల లోడుతో ఆంధ్రా నుంచి హర్యానాకు వెళ్తున్న లారీ వేగంగా వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో బొలెరో వాహనం డివైడర్ పై నుంచి కరీంనగర్ వైపు వెళ్లే రాజీవ్ రహదారిపై దూసుకెళ్లి బోల్తా పడింది. వెనుక నుంచి వస్తున్న లారీ కూడా అదుపుతప్పి డివైడర్ పైనుంచి అతివేగంతో కొంత దూరం వెళ్లి బోల్తా పడింది. కాగా, బొలెరోలో ఉన్న డ్రైవర్ కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అంబులెన్స్ లో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి సుల్తానాబాద్ పోలీసులు చేరుకొని, ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సుల్తానాబాద్ ఎస్ఐ పేర్కొన్నారు.

# ఓయూ మైనింగ్ విభాగానికి విరాళం

* వీసీ ప్రొ. కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు

**సికింద్రాబాద్,తెలంగాణ చౌరస్తా:**




ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (స్వయంప్రతిపత్తి)లోని మైనింగ్ ఇంజనీరింగ్ విభాగం నూతన భవన నిర్మాణానికి అమెరికాకు చెందిన 'టెల్లా సకమోటో ఫౌండేషన్' ( USA) 1,00,000 అమెరికన్ డాలర్ల (ఒక లక్ష యూఎస్ డాలర్లు) భారీ విరాళాన్ని ప్రకటించింది.ఈ నిధుల ఒప్పందంలో భాగంగా, మొదటి విడతగా రూ. 40 లక్షల చెక్కును ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అలుమ్ని అసోసియేషన్ ద్వారా తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ హైదరాబాద్‌కు గురువారం అధికారికంగా అందజేశారు. ఈ నిధులను మైనింగ్ విభాగంలో ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు (ల్యాబ్స్), పరిశోధనా కేంద్రాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించనున్నట్లు ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. పైడిమర్రి. చంద్రశేఖర్ పేర్కొన్నారు.ఉస్మానియా యూనివర్సిటీ మైనింగ్ ఇంజనీరింగ్ మొదటి బ్యాచ్‌కి చెందిన ప్రముఖ పూర్వ విద్యార్థి టి. గోపాల్ రావు చొరవ, సహకారంతోనే టెల్లా సకమోటో ఫౌండేషన్ నుండి ఈ భారీ విరాళం సమకూరింది. ఈ సందర్భంగా ఓయూ వీసీ ప్రొ. కుమార్ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఓయూసీఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, వైస్‌ప్రిన్సిపాల్ ప్రొ. బి. మంగు, TGEWIDC ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిత, అలుమ్ని అసోసియేషన్ ప్రతినిధి థామస్ రామల, మైనింగ్ ఇంజనీరింగ్ అలుమ్ని అసోసియేషన్ సభ్యులు డి. ఎన్. ప్రసాద్, బిక్కి రమేష్ కుమార్, చిత్తరంజన్ రెడ్డి, డాక్టర్ కె. శ్రీనివాస్, మైనింగ్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం. సతీష్ కుమార్, ఇ. శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రశిక్షణను విజయవంతం చేయడమే ధ్యేయం

**వరంగల్, తెలంగాణ చౌరస్తా:**



భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రశిక్షణ తరగతుల ప్రిపరేటరీ సమావేశం హంటర్ రోడ్ సత్యం కన్వెన్షన్ హాల్ లో జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ అధ్యక్షతన జరిగింది.ముఖ్య అతిథిలుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష,జిల్లా ఇన్చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పాల్గొనగా,ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ...రాబోయే శిక్షణా తరగతుల రూపకల్పన,ఎజెండా ఖరారు మరియు బాధ్యతల విభజన. ఈ సందర్భంగా శిక్షణను ప్రతి ఒక్కరికీ చేరవేయడానికి మరియు నాణ్యమైన నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ సన్నాహక సమావేశం ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు, మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రత్నం సతీష్ షా, గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి,జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, ప్రశిక్షణ కన్వీనర్లు, డివిజన్ కన్వీనర్లు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో పగలు 'లైసెన్స్'..రాత్రి 'లంగరు

* బెల్ట్ షాపుల వెనుక ఉన్న ఆ బడా బాబు ఎవరు..?
* అధికారిక దుకాణాలు ఉత్తవే.. అసలు వ్యాపారమంతా ఊరూరా సందుల్లోనే
* ఎమ్మార్పీ అన్న పదానికే అర్థం మార్చేసిన సిండికేట్
* చూసీచూడనట్లు నటిస్తున్న ఎక్సైజ్ యంత్రాంగం
* కూలీల రక్తం తాగుతున్న మద్యం మాఫియా
* కాసుల కక్కుర్తిలో పాలకుల అండదండలు

**అశ్వారావుపేట తెలంగాణ చౌరస్తా:**

చట్టం తన పని తాను చేసుకుపోతుందని పాలకులు చెప్తారు.. కానీ అశ్వారావుపేట నియోజకవర్గంలో మాత్రం చట్టం 'మద్యం సిండికేట్' చెప్పినట్లు వింటోంది. ఇక్కడ ప్రభుత్వ నిబంధనలు, ఎక్సైజ్ శాఖ నియామకాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. టెండర్లలో కోట్ల రూపాయలు కుమ్మరించి మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులకు, కేవలం దుకాణాల ద్వారా వచ్చే లాభాలు సరిపోవడం లేదు. అందుకే వారు ఎంచుకున్న అడ్డదారి.. 'బెల్ట్ షాపుల వ్యవస్థ'. నేడు అశ్వారావుపేట మండల పరిధిలో అధికారిక దుకాణాల కంటే అక్రమంగా నడిచే ఈ బెల్ట్ షాపుల సంఖ్యే మూడు రెట్లు ఎక్కువగా ఉందంటే ఇక్కడి పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**అసలు వ్యూహం ఇదీ.. బ్రాందీ షాపులు కేవలం 'గోదాములు'**

నిజానికి ఒక బ్రాందీ షాపును ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడపాలంటే నిర్ణీత వేళలు పాటించాలి, ప్రతి బాటిల్‌ను గరిష్ట రిటైల్ ధర (ఎమ్మార్పీ) కే అమ్మాలి. అలా అమ్మితే తాము ఆశించిన స్థాయిలో కోట్లు సంపాదించలేమని గ్రహించిన కొందరు బడా వ్యాపారులు ఒక పక్కా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన మద్యం షాపులను కేవలం 'గోదాములు' (సరుకు నిల్వ ఉంచే కేంద్రాలు) గా వాడుకుంటున్నారు. అక్కడి నుండి ప్రతిరోజూ తెల్లవారుజామునే జిల్లాల్లోని మారుమూల గ్రామాలకు, సందు గొందుల్లోని కిరాణా షాపులకు, హోటళ్లకు పెట్టెలకు పెట్టెలుగా మద్యం బాటిళ్లు తరలిపోతున్నాయి. బ్రాందీ షాపుల్లో దొరకాల్సిన బ్రాండ్లు సైతం సామాన్యుడికి దొరక్కుండా చేసి, వాటిని బెల్ట్ షాపులకు తరలించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**సమయం దాటితే రేటు డబుల్.. అర్ధరాత్రి దోపిడీ**


ప్రభుత్వ నిబంధనల ప్రకారం రాత్రి కాగానే మద్యం దుకాణాలు మూతపడాలి. కానీ అశ్వారావుపేటలోని బెల్ట్ షాపులకు కాలంతో పనే లేదు. అర్ధరాత్రి 12 గంటలైనా, తెల్లవారుజామున 4 గంటలైనా ఇక్కడ మద్యం లభ్యమవుతుంది. సమయం దాటిన తర్వాత ప్రతి బాటిల్‌పై కనీసం 30 నుండి 50 రూపాయలు, కొన్ని బ్రాండ్లపై వంద రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. పగలు రాత్రి కష్టపడి సంపాదించిన కూలీ డబ్బులను, ఈ అక్రమ కేంద్రాలలో పోసి పేదలు తమ సంసారాలను గుల్ల చేసుకుంటున్నారు. "పగలు రేటు ఒకలా ఉంటే, రాత్రి పూట అడిగినంత ఇవ్వాల్సిందే.. లేదంటే మందు దొరకదు" అని స్థానిక కూలీలు గుండెలు బాదుకుంటున్నారు.

**నిమ్మకు నీరెత్తిన యంత్రాంగం.. ముడుపుల మాయాజాలం**

ఇంత బహిరంగంగా, కంటికి కనిపిస్తూ ఊరూరా మద్యం ఏరులై పారుతుంటే నిఘా పెట్టాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? ఇదే ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్న ప్రశ్న. నూతన మద్యం పాలసీ వచ్చినప్పటి నుండి ఎవరెవరికి ఎంతెంత ముట్టజెప్పాలో అంతా ముందే నిశ్చయమైపోయిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. నెలవారీ 'మామూళ్లు' సమయానికి అందుతుండటంతో, తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్, పోలీస్ అధికారులు కంటికి కనపడనంత దూరంగా ఉండిపోతున్నారు. ఒకవేళ ఎవరైనా ఫిర్యాదు చేస్తే, ముందే సమాచారం అందించి సదరు బెల్ట్ షాపుల నుండి సరుకును దాచిపెట్టేలా సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**రాజకీయ అండదండలు.. సిండికేట్ హోదా వైపు అడుగులు**

ఈ దందా వెనుక కేవలం మద్యం వ్యాపారులే లేరు, స్థానిక రాజకీయ నేతల హస్తం కూడా పుష్కలంగా ఉంది. ఎన్నికల ఖర్చులకు, పార్టీ ఫండ్లకు ఈ సిండికేట్ శక్తులే ఆర్థిక వనరులుగా మారుతుండటంతో నాయకులు సైతం నోరు మెదపడం లేదు. గతంలో పత్రికల్లో ఎన్ని వార్తలు వచ్చినా, ప్రజలు నిరసనలు తెలిపినా కనీస స్పందన లేకపోవడానికి ఈ రాజకీయ రక్షణే కారణం. ఈ బెల్ట్ షాపుల ద్వారా వస్తున్న అపారమైన నల్లధనంతో ఈ వ్యాపారులు రేపు సొంతంగా ఒక పెద్ద సిండికేట్ నెంబర్లుగా మారి, నియోజకవర్గ రాజకీయాలను శాసించే హోదాకు వెళ్ళిపోయే ప్రమాదం కూడా పొంచివుంది.



### ఇకనైనా కళ్ళు తెరుస్తారా

అశ్వారావుపేటను పట్టి పీడిస్తున్న ఈ బెల్ట్ షాపుల క్యాన్సర్‌కు చరమగీతం పాడాల్సిన బాధ్యత ఉన్నతాధికారులపై ఉంది. కేవలం క్రింది స్థాయి సిబ్బంది ఇచ్చే నివేదికలపై ఆధారపడకుండా, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. అక్రమంగా నడుపుతున్న బెల్ట్ షాపులను సీజ్ చేయడమే కాకుండా, వాటికి మద్యాన్ని సరఫరా చేస్తున్న ప్రధాన బ్రాందీ షాపుల లైసెన్సులను రద్దు చేయాలి. లేనిపక్షంలో సామాన్య ప్రజల, తాగుబోతుల ఆగ్రహానికి అధికారులు, పాలకులు బలికాక తప్పదని ఈ కథనం ద్వారా తెలియజేస్తున్నాం.

